క్లుప్తంగా

రోడ్డు పనులు పూర్తి చేయాలి


రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్

సాక్షి స్పందన

మేడిపల్లి: ఈరోడ్లపై ప్రయాణమెలా...అనే శీర్షికన జూలై 15వ తేదీన సాక్షి పేపర్‌లో ప్రచురితమైన కథనానికి జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ స్పందించారు. కట్లకుంట – తొంబరావుపేట రోడ్డు ను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. కట్లకుంట – తొంబరావుపేట రోడ్డు పనులు వేగవంతం చేసి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, ఈపీఆర్‌వో లక్ష్మణరావు, తహసీల్దార్ మునిందర్, ఎంపీడీవో పద్మజ, అధికారులు ఉన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి


పరిసరాలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జగిత్యాల: పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని అదనపు కలెక్టర్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ లత అన్నారు. శుక్రవారం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్యాన్ని మెరుగుపర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొంత మేర సక్రమంగా లేకపోవడంతో అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట కమిషనర్ స్పందన ఉన్నారు.

కేజీబీవీ టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి


సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

జగిత్యాల: కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనందరావు, అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కేజీబీవీ ధరూర్‌క్యాంప్, వీక్లీబజార్ పాఠశాల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు విద్యాదేవి, పద్మ, శశికళ, చందన, ప్రభాకర్, అనూజ, శ్రీదేవి, సుజాత, ప్రవీణ్, షఫీ, రమేశ్, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల సమస్యలు పరిష్కరిస్తా

రాయికల్: జిల్లాలోని స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అవసరమైతే ఎంపీ ధర్మపురి అర్వింద్ దృష్టికి తీసుకెళ్తానని స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు మూగల మారుతి అన్నారు. శుక్రవారం పట్టణంలో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ, స్వర్ణకారులకు బీజేపీ ఎప్పుడూ అండగా ఉందన్నారు. పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి, నాయకులు కదార్ల శ్రీనివాస్, భూమేశ్, సంజీవ్, రామన్న, శ్రీకాంత్‌రెడ్డి, సామల్ల సతీశ్, పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



కోరుట్ల: జగిత్యాల జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కోరుట్ల పట్టణంలోని నవజ్యోతి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభచాటారు. శుక్రవారం మెట్‌పల్లి పట్టణంలోని మినీ స్టేడియంలో జరిగిన పోటీల్లో ఆనంది, వర్షిత, హర్షవర్ధన్, శ్రీనివాస్ ప్రతిభ చాటారు. విజేతలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి ప్రశంసపత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ సుజాత, పీఈటీ సాయికుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

నీటిని విడుదల చేయించాలని వినతి

మెట్‌పల్లి రూరల్: ఎస్సారెస్పీలో నీరు లేకపోవడంతో పంటల సాగుకు ఆటంకం ఏర్పడుతోందని మెట్‌పల్లి మండలం వెల్లుల, జగ్గాసాగర్, రామలచ్చక్కపేట, మేడిపల్లికి చెందిన రైతులు కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావుకు శుక్రవారం రైతులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన నర్సింగరావు ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి నీటిని త్వరగా విడుదల చేయాలని కోరారు.

చకచకా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- పైలెట్ ప్రాజెక్టుగా చిత్రవేణిగూడెం
- 74 ఇళ్లు మంజూరు
- పురోగతిలో 37 ఇళ్లు
- 24 ఇళ్లకు బిల్లులు చెల్లింపు


స్లాబ్ వరకు పూర్తయిన ఇంటి నిర్మాణం


చిత్రవేణిగూడెం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

సారంగాపూర్: ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోంది. బీర్‌పూర్ మండలం చిత్రవేణిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తరచూ గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పనుల్లో పురోగతి కనిపిస్తోంది.

పైలెట్ ప్రాజెక్టుగా చిత్రవేణిగూడెం

బీర్‌పూర్ మండలంలో గోదావరి ఒడ్డున ఉన్న ఈ గిరిజన గ్రామంలో గిరిజనుల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. గ్రామ జనాభా 680 పైచిలుకు ఉంటుంది. గ్రామం మొత్తం గొండు తెగ నిరుపేద గిరిజనులు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఈ గ్రామం నుంచే ప్రారంభించింది.

మంజూరైన ఇళ్లు 74..

ఇందిరమ్మ పథకం కింద 74 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. మంజూరైన ప్రతీ కుటుంబం ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులు అవగాహన కల్పించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. దీంతో ఏకంగా ఒకేసారి 37 మంది ఇళ్లు నిర్మాణాలు ప్రారంభించి, పనులను కొనసాగిస్తున్నారు. అధికారులు అవసరమైన సలహాలను, సూచనలను చేస్తూ దగ్గరుండి పనులను పరిశీలిస్తుండడంతో పనులు ప్రగతికి తగిన విధంగా ప్రభుత్వం వారికి బిల్లుల చెల్లింపులు జరిపుతుంది. ఇళ్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్మాణం చేపట్టడంతో ఇప్పటికే 24 మందికి ఇళ్ల బిల్లుల చెల్లింపులు జరిగాయి. ఒక ఇల్లు స్లాబ్ నిర్మాణం పూర్తయింది.

ప్రారంభం కాని మరో 37 ఇళ్లు....

కాగా ప్రారంభించిన ఇళ్లు వేగంగా సాగుతుండగా, మరో 37 మంది వివిధ కారణాలతో ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. దీంతో అధికారులు వారిని ఇళ్లు నిర్మించుకునేలా ఒప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో పాటు ఆర్థికంగా లేని వారికి మహిళా సంఘాల నుంచి రూ.1లక్ష వడ్డీ లేని రుణం ఇస్తున్నారు. దీంతో చిత్రవేణి గూడెంలో వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోంది.

సంతోషంగా ఉంది



ఎంతో కాలంగా సొంత ఇల్లు నిర్మించుకోవాలని మా కుటుంబానికి కలగా ఉండేది. పదేళ్ల తరువాత ఈ కల నెరవేరింది. కుటుంబం అంతా సంతోషంగా పనుల్లో పాలుపంచుకుంటున్నాం. వీలైనంతా త్వరగా నిర్మాణం పూర్తి చేస్తాం.

– చిత్రం స్వరూప..చిత్రవేణిగూడెం

పదేళ్లు నిరీక్షించాం



పదేళ్లుగా ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని నిరీక్షించాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాగానే ఇందిరమ్మ పథకం మాకు ఇల్లు మంజూరు కావడంతో, ఇంటి నిర్మాణం ప్రారంభించి ప్రభుత్వ సాయంతో ఇల్లు నిర్మించుకుంటున్నాం.

– కుడిమెత జమున, చిత్రవేణిగూడెం

ఇళ్లు పూర్తి చేయడానికి చర్యలు



మంజూరైన ఇళ్లలో కొన్ని ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. పనులు ప్రారంభించని లబ్ధిదారులను నేరుగా కలుస్తున్నాం. వంద శాతం ఇళ్లు పూర్తి చేయడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కృషి చేస్తున్నాం.

– భీమేశ్, ఎంపీడీవో, బీర్‌పూర్


గోరింటాకు వేడుకల్లో విద్యార్థినులు, ఎంఈవో గాయత్రి


మల్యాల మండల పరిషత్ కార్యాలయంలో గోరింటాకు వేడుకలు

గోరింటాకు వేడుకలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో గాయత్రి, ఇన్‌చార్జి హెచ్‌ఎం మద్దెల సరోజన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో స్వాతి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు గోరింటాకు సంబురాలు నిర్వహించుకున్నారు.

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం గోరింటాకు మహోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా శుక్రవారం మహిళ ఉపాధ్యాయులు,విద్యార్థినిలు చేతులకు గోరింటాకు పెట్టుకొని సందడి చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


మేడిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో గోరింటాకు వేడుకల్లో విద్యార్థినులు

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్సై సుప్రియ అన్నారు. శుక్రవారం స్థానిక నవ్య బాలికల జూనియర్ కళాశాలలో స్వాగతోత్సవ వేడుకలు నిర్వహించగా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సమాజంలో జరిగే అరాచకాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుకుని ఉన్నతస్థానాలకు వెళ్లాలన్నారు. అనంతరం ఇంటర్ స్థాయిలో మార్కులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నరేశ్, ఈశ్వర్‌కుమార్ పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

జగిత్యాలరూరల్: గ్రామీణ నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని జగిత్యాల సింగిల్ విండో వైస్ చైర్మన్ శీలం సురేందర్ అన్నారు. శుక్రవారం జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మాజీమంత్రి జీవన్‌రెడ్డి ఆదేశాలనుసారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో వాసవి, మాజీ ఉపసర్పంచ్ మహేశ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే విద్యా వికాసం

జగిత్యాల: క్రమశిక్షణతో అభ్యాసం చేయడం ద్వారా విద్యార్థుల్లో విద్య వికాసం సాధ్యమవుతుందని , తద్వారా ఉన్నత లక్ష్యాలకు చేరుకుంటారని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం కళాశాలలో బోధన, పరిశీలన, క్రమశిక్షణతోనే విద్యా వికాసం అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వయం ప్రతిపత్తి సాధించిన తర్వాత కళాశాల మొదటిస్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.వాసవి, చంద్రయ్య, రామచంద్రం, వరప్రసాద్, సంగీత, నీరజ, రహీం, మల్లికార్జున్, జమున, సత్యం, సుజాత పాల్గొన్నారు.

హోంగార్డుకు ఆర్డర్ కాపీ అందజేత

జగిత్యాలక్రైం: జగిత్యాల పోలీసు శాఖలో హోంగార్డుగా పనిచేస్తున్న ఆర్.వెంకటేశ్వర్లు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపిక కాగా, శుక్రవారం జగిత్యాల పోలీసు ప్రధాన కార్యాలయంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సైదులు వెంకటేశ్వర్లుకు ఆర్డర్ కాపీ అందజేశారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వేణు, హోంగార్డులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నుంచి విద్యార్థుల డిశ్చార్జ్

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్‌లోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు బుధవారం తిన్న భోజనం ఫుడ్ పాయిజన్ కావడంతో జగిత్యాల మాత శిశు సంరక్షణకేంద్రంలో చికిత్స పొందారు. ఐదుగురు విద్యార్థినుల ఆరోగ్యం కుదుట పడటంతో శుక్రవారం వారిని డిశ్చార్జి చేశారు. దీంతో పాటు పాఠశాలలోని విద్యార్థినులు కూడా పూర్తిగా కోలుకోవడంతో తరగతులకు హాజరైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చైతన్యలత తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 40మంది క్రీడాకారుల ఎంపిక

మెట్‌పల్లి: పట్టణంలోని మినీ స్టేడియంలో శుక్రవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. దీనికి సుమారు వెయ్యి మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అండర్–14,16,18,20 విభాగాల్లో వివిధ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన 40మందిని వచ్చే నెల 3న హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి తెలిపారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జెట్టి లింగం, అల్లూరి మహేందర్‌రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు గజెల్లి రాందాస్, పీఈటీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి మెనూ పాటించాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనాని అందించాలని తహసీల్దార్ రమేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్ ఎస్టీ మినీ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట ఆర్‌ఐ రాజేష్, జీపీ ఈవో శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ మనోహర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : మండలంలోని పలు పాఠశాలలను అధికారులు శుక్రవారం తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. ఇబ్రహీంపట్నం మోడల్‌స్కూల్‌లో తహసీల్దార్ వరప్రసాద్ విద్యార్థులకు వండిన భోజనాన్ని, తాగునీరును పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అమ్మక్కపేట ప్రాథమిక పాఠశాలలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, కోమటికొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఏవో రాజ్‌కుమార్ విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమారంగంలో ఉచిత శిక్షణ ఉపాధి కార్యక్రమం అందిస్తోందని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఆర్‌ఎస్ చిత్రు తెలిపారు. హైదరాబాద్‌లో నెల పాటు శిక్షణ ఉంటుందని, మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 18 నుంచి వచ్చేనెల 18 వరకు అభ్యర్థులు తమ దరఖాస్తులను మైనార్టీ శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 040–23236112 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలి

మల్లాపూర్: నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం రైతులతో సమావేశమై మాట్లాడారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పదేళ్ల క్రితం మూతపడడంతో చెరుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఈ నెల 20న మల్లాపూర్ సోమేశ్వర కొండ వద్ద నుంచి ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ వరకు చేపట్టనున్న'పాదయాత్ర'ను రైతులందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల కాంతయ్యచారీ, మండల ప్రభారీ పీసు రాజేందర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ, తక్కళ్లపల్లి, సోమన్‌పల్లి, సంగంపల్లి, హబ్సీపూర్, గుత్రాజ్‌పల్లి, అనంతారం, లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్ గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు.


కోరుట్లలో బోనాలతో వస్తున్న మహిళలు


కథలాపూర్‌లో బోనాల వేడుకల్లో చిన్నారులు

ఆషాఢ మాస బోనాలు

కోరుట్ల: పట్టణంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్ వద్ద గల దుర్గా ఆలయంలో అమ్మవారికి భక్తులు శుక్రవారం ఆశాఢమాస బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఐదు చేతుల పోచమ్మకు..

పట్టణంలోని ఆరె కటికె సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఐదు చేతుల పోచమ్మకు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆషాఢమాసం బోనాల పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బోనం ఎత్తుకుని పండుగను చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాజన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండ జ్యోతివాణి పాఠశాలలో శుక్రవారం ఆషాఢం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బోనాలతో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి హైస్కూల్‌లో శుక్రవారం బోనాల సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినిలు సాంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి బోనాలతో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తోట రవీందర్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు దక్కాలి


మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్లరూరల్/మల్లాపూర్/మెట్‌పల్లిరూరల్: అర్హులకే సంక్షేమ పథకాలు దక్కాలని, లబ్ధిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకత పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేఎంఆర్ గార్డెన్స్‌లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు పంపిణీ చేశారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూళ్లను సందర్శించి ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.4లక్షలతో నిర్మించిన వాటర్ ఆర్వో ప్లాంట్లను ప్రారంభించారు. విద్యార్థులు చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా చదువు ప్రాముఖ్యతను తెలుసుకొని ముందుకుసాగాలన్నారు. ఎంపీడీవో శశికుమార్ రెడ్డి, ఎంపీవో జగదీశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్ ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. కోరుట్ల పట్టణంలోని కావేరి గార్డెన్స్‌లో శుక్రవారం 108 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

రాయికల్: కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయికల్ పట్టణంలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేసి మాట్లాడారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ హయాంలో డబుల్‌బెడ్రూంల పేరిట కాలయాపన చేశారే గానీ, అర్హులకు అందించలేదన్నారు. పేదలను పారదర్శకంగా ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేశామని, దశలవారీగా మంజూరవుతాయని పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, మహిళ అధ్యక్షురాలు తాటిపాముల మమత తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేస్తాం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ నివాసంలో శుక్రవారం మాట్లాడారు. నియోజకవర్గంలో లబ్ధిదారులకు 3500 ఇళ్ల నిర్మాణాలకు ప్రొసీడింగులు ఇచ్చామని, ఉచిత కరెంట్, బస్సు ప్రయాణ ం, రైతు భరోసా వంటి ప్రజా సంక్షేమ పథకాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ రాజా నర్సింగారావు, ఏఎంసీ చైర్మన్ జీవన్ రెడ్డి, ముత్యం శంకర్, మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయాలి

జగిత్యాలటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23న నిర్వహించే రాష్ట్రవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అక్రమాలిక్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు తాము చేయబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ విద్యాసంస్థల నిర్వీర్యంలో కేసీఆర్ సర్కార్‌ను మించిపోయిందన్నారు.ఇప్పటికైనా హామీలు అమలు చేయాలని లేకుంటే వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు చందు, రాకేశ్, ప్రేంకుమార్, రహీం, రామచంద్ర, సంజయ్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో పంటలకు సరిపడా నీరు

ధర్మపురి : బీఆర్‌ఎస్ హయాంలో రైతులకు సరిపడ సాగునీరందించామని కాంగ్రెస్ హయాంలో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి సమీపంలోని అక్కపెల్లి చెరువును సందర్శించి మాట్లాడారు. చెరువులో నీరు లేక పోవడంతో అసహనం వ్యక్తం చేశారు. రైతాంగానికి నీరందించడానికి బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 72.10 కోట్లు మంజూరు చేయగా నిధులతో గోదావరి నుంచి అక్కపెల్లి చెరవుకు లిఫ్టులతో నీరందుతుందని భావించి పనులను ప్రారంభించారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో అట్టి పథకం పనులు పూర్తి కాక నిధులు నీళ్లపాలయ్యే పరిస్థితి అన్నారుమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పట్టించుకొని రైతుల బాగు కోసం పాటుబడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేష్, నాయకులు, రైతులు తదితరులున్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలి

జగిత్యాల: ఈనెల 23న చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్ అన్నారు. జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వామపక్ష విద్యార్థి సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ఈనెల 23న తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అక్రమాలిక్, చందు, ప్రేమ్‌కుమార్, రాకేశ్, రహీం, సంజయ్ పాల్గొన్నారు.

అంతర పంటల సాగుతో అధిక లాభాలు

వెల్గటూర్: ఆయిల్ పామ్ తోటలో అంతర పంటల సాగు చేస్తే అధిక లాభాలు ఉంటాయని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ అన్నారు. శుక్రవారం వెలగటూర్, ఎండపల్లి మండలాలలోని కోటిలింగాల, అంబరిపేట గ్రామాల్లో రైతులు ఆయిల్‌పామ్, మక్క పంటను, వరి నారు మడులను, వరి పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు సాయి కిరణ్, మహేశ్, ఏఈవోలు సందీప్, మౌనిక, లావణ్య, రైతులు పాల్గొన్నారు.

ఎకరాకు ఒక బస్తా యూరియా మాత్రమే అందించాలి

సారంగాపూర్: రైతులకు యూరియా ఒక ఎకరాకు ఒక బస్తా చొప్పున విక్రయించాలని సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల వ్యవసాయాధికారి ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ యూరియా అమ్మే సమయంలో డీలర్లు నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలు జరపాలని, ఒక ఎకరానికి ఒక బస్తా యూరియాను మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఆయన వెంటఏఈవోలు వెంకటేష్, అంజనేయులు, వినోద్ ఉన్నారు.

జీపీ కార్యాలయానికి భూమిపూజ

వెల్గటూర్: మండలం కోటిలింగాలలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో శ్రీనివాస్‌లు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మెన్ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

టెండర్ వాయిదా

మల్యాల: కొండగట్టు అంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించాల్సిన తలనీలాల టెండర్ ఈ నెల 24కు వాయిదా వేసినట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. టెండర్ బాక్సుకు సీల్ వేయలేదని కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేయడంతో టెండర్ వాయిదా వేసినట్లు ఈవో తెలిపారు.